సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 23 । జనవరి । 2025



లారీ డ్రైవర్లపై ఖాకీ జులుం

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ల పై మదనపల్లె తాలూకా పోలీసులు ఖాకీ జులుం ప్రదర్శించారు. ఈ ఘటనలో ఒకరికి కాలు విరిగింది. -8లో



సింగిల్ విండోలో నాణ్యతలేని బంగారంపై రుణాలు

కన్నెమడుగు సహకార సొసైటీ సింగిల్ విండో బ్యాంకులో నాణ్యతలేని బంగారంపై రుణాల పంపిణీ జరిగినట్లు తెలిసింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 81 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

7న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 7వ తేది ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా అధికారులు ఆరోజు ఉదయం 10 గంటలకు కడపలోని జెడ్పీసమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల

కడప ఎడ్యుకేషన్: వై.ఎస్.ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 7,5 , 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన తక్కువ సమయంలో ఫలితాల విడుదల కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి జి.ఫణీంద్ర రెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి, పీఆర్ఓ వి. శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్: జిల్లా మహిళ, పురుషుల అండర్ 23 ఇంటర్ డిస్ట్రిక్ జిల్లాస్థాయి బ్యాస్కెట్ బాల్ ఎంపికలను 23వ తేదీ గురువారం కడపలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్తు బాలికల హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సదశివారెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చాటిని వారు ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు విజయవాడలోని మేరిస్ స్టెల్లా కాలేజీలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు. క్రీడాకారులు 2002 జనవరి 1వ తేదీకి ముందు పుట్టినవారై ఉండాలని తెలిపారు.

ప్రతి చెల్లింపునకు బిల్లు తప్పనిసరి



కలకడ ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న రవికుమార్‌నాయుడు

కలకడ: జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల్లో ప్రతి చెల్లింపునకు బిల్లు తీసుకుని ఆడిట్ లో చూపాలని చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గతంలో ఖర్చులు చేసినవాటికి బిల్లులు, ఖర్చులకు అవసరమైన మండల సర్వసభ్యసమావేశం తీర్మానం, జిల్లా పరిషత్ నుంచి విడుదలైన నిధులు కేటాయించిన పనులకే ఖర్చు చేశారా అనే అంశాలను పరిశీలించారు. జిల్లా, మండల పరిషత్ అనుమతి లేకుండా నిధులు ఖర్చు చేస్తే రికవరీ తప్పదని హెచ్చరించారు. ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్ వ్యవస్థలో జవాబుదారీతనం ఉండాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, మండల విద్యాశాఖాధికారి మునీంద్రనాయక్, ఏపీఓ చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం.. శత శాతం

- కేజీబీవీల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు
- ప్రారంభమైన వారాంతపు పరీక్షలు

మదనపల్లె సిటీ: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థులు పది,ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే ఆశయంలో సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలను రూపొందించారు. పది, ఇంటర్మీడియట్ పరీక్షలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నిచ్చెనలాంటివి. వారి జీవితాలు మలుపు తిరిగేది ఇక్కడే. ఇంతటి ప్రాధాన్యత ఉండటంతో జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించారు. పూర్తిగా వెనుబడిన పిల్లలను సైతం కనీస మార్కులతోనైనా గట్టెక్కించేలా చూడాలంటూ ఎస్‌ఓలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రణాళిక మేరకు సన్నద్ధమైతే ఉత్తీర్ణత మార్కులు సాధించడం పెద్ద సమస్య కాదు. ప్రత్యేక తరగతులు, వంద రోజుల ప్రణాళిక అంటూ ఉపాధ్యాయులు విద్యార్థుల వెంటబడుతున్నారు.ఈ స్ఫూర్తితో జిల్లాలోని కేజీబీవీ విద్యార్థులనులను సన్నద్ధం చేస్తున్నారు.ఇందు కోసం స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షల నిర్వహణ చేపట్టి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. దీంతో పాటు చదువులో వెనుకబడిన పిల్లలను సైతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు సీఆర్‌టీ,పీజీటీలతో పాటు ప్రిన్సిపాళ్లకు పలు సూచనలు చేస్తున్నారు. ఈ మేరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికతో పాటు పంచతంత్ర పేరుతో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అమలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ తరగతులను నిర్వహించడంతో పాటు ప్రతి నిత్యం పరీక్ష ..వారాంతం చివరిలో గ్రాండ్ టెస్టును నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు గ్రాండ్ టెస్టులు, ఎనిమిది వారాంత పరీక్షలను నిర్వహించారు. ఈసారి ఉత్తమ మార్కులు సాధించేలా చర్యలు చేపట్టారు.



ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

- అన్నమయ్య జిల్లాలో 22 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 801 మంది పదోతరగతి చదువుతుండగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 513, ద్వితీయ సంవత్సరం 432 మంది చదువుతున్నారు. వీరందరి కోసం సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారులు ప్రత్యేకంగా వంద రోజుల కార్యాచరణతో పాటు పంచతంత్ర అమలు చేస్తున్నారు. ఇందు కోసం ప్రిన్సిపాళ్లతో పాటు సీఆర్టీ, పీజీటీలు కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని చదవిస్తున్నారు.



దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు, ఏయే సబ్జెక్టుల్లో వెనుబడి ఉన్నారనే అంశాలను వారు పరిశీలించి వాటిపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. పిల్లల్లో లోపాలుంటే వాటిని అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

అమలు తీరు ఇలా....!



తంబళ్లపల్లె కేజీబీవీ విద్యాలయం

కేజీబీవీల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమగ్రశిక్ష ప్రాజెక్టు వంద రోజుల ప్రణాళిక తయారు చేశారు. ఇందులో ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6.30 వరకు ప్రైవేటు టైమ్.. 6.30 నుంచి 7.30 వరకు సబ్జెక్టు ప్రిపరేషన్, 7.30 నుంచి 8.30 వరకు వీక్లీ టెస్టు, 8.30 నుంచి 9 గంటల వరకు బ్రేక్‌ఫాస్టు, 9 నుంచి 9.15 వరకు అసెంబ్లీ, 9.15 నుంచి 10.45 వరకు సబ్జెక్టు-1, 10.45 నుంచి 11 గంటల వరకు బ్రేక్, 11 నుంచి 12.30 వరకు సబ్జెక్టు-2, 12.30 నుంచి 1.15 వరకు లంచ్‌బ్రేక్, 1.15 నుంచి 2.45 వరకు సబ్జెక్టు-3, 2.45 నుంచి 3 గంటల వరకు బ్రేక్, 3 నుంచి 4.30 వరకు సబ్జెక్టు-4 , 4.30 నుంచి 5 వరకు బ్రేక్, 5 నుంచి 6.30 వరకు సబ్జెక్టు-5, 6.30 నుంచి 7.30 వరకు డిన్నర్, రాత్రి 7.30 నుంచి 10 గంటల వరకు సబ్జెక్టు-6 ఉంటుంది. దీంతో పాటు ఈ ఏడాది ఎస్‌సీఆర్‌టీ పంపిన మోడల్ పేపర్లను డీసీఈబీ వారు కేజీబీవీలకు అందించి ప్రణాళికలను అమలు చేస్తున్నారు.

మంచి మార్కులు సాధిస్తా



పదోతరగతిలో మంచి మార్కులు సాధిస్తా. ఇందుకోసం మా ప్రిన్సిపాల్, సీఆర్‌టీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నారు. వంద రోజుల ప్రణాళిక బాగుంది. -దీక్షిత, పదో తర గతి విద్యార్థిని, కేజీబీవీ, తంబళ్లపల్లె

సంకల్ప్‌తో ఉపయోగపడుతుంది



సంకల్ప్ మోడల్ పేపర్లు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. సీఆర్‌టీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు బాగా రాస్తున్నాం. మంచి మార్కులు వస్తాయి. -నందు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కేజీబీవీ, తంబళ్లపల్లె

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి.. జవాబులు ఎలా రాయాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. -ఆలియాబేగం, ఆంగ్ల అధ్యాపకురాలు, కేజీబీవీ, తంబళ్లపల్లె

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



అన్ని కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలి. దీంతో పాటు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలి. మంచి ఫలితాల సాధనకు ప్రత్యేక దృష్టి సారించాలి. -సుబ్రమణ్యం, డీఈఓ

ఉచితం పేరుతో ఇసుక దోపిడీ

- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్
- చోద్యం చూస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీలోని పాపాగ్ని నదిలోని ఇసుకకు ఇటు ఆంధ్రా అటు కర్ణాటక రాష్ట్రంలోని మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు సమగ్రమైన ఆదేశాలు జారీ చేస్తూ స్టే ఇచ్చింది. అయితే స్థానికంగా ఉన్న పంచాయతీ ప్రజల గృహ అవసరాల నిమిత్తం ఇసుకను వాడుకోవచ్చని ఆదేశాలు ఉన్నాయి. ఇందుకు భిన్నంగా కూటమి నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తూ కోర్టు నిబంధనలను తుంగలో తొక్కుతూ జేబులు నింపుకుంటున్నారని ఈ పంచాయతీకి చెందిన రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాపాగ్ని నదిలోని ఇసుకను సునాయాసంగా తరలించేందుకు జేసీబీలతో రోడ్డును కూడా చదును చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. పంచాయతీకి చెందిన చోటా మోటా టీడీపీ నాయకులతో పాటు పక్క గ్రామాలు, మండలాలకు చెందిన కూటమి నాయకులు సైతం పాపాగ్ని నదిలోని ఇసుకను ఇష్టారాజ్యంగా తోడేస్తుండటంతో తమ వ్యవసాయ బోర్లలో నీరు అడుగంటి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

సీమకు ద్రోహం చేస్తున్నారు

జమ్మలమడుగు: తరతరాలుగా రాయలసీమకు అన్యాయమే జరుగుతోందని.. ప్రస్తుత చర్యలు కూడ అలాగే ఉన్నాయని రాయలసీమ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ప్రతాపరెడ్డి మండిపడ్డారు. కడపలో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మిస్తామని చెప్పి ప్రస్తుతం అనకాపల్లిలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పడం రాయలసీమకు తీవ్రమైన అన్యాయం చేయడమే ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక ఐటీఐ ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో ఉన్న హామీలను అమలు చేయకుండా ఎటువంటి హామీలేని అనకాపల్లి స్టీల్‌ప్లాంట్ ,విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం దాదాపు 11వేల కోట్ల రూపాయలు కేటాయించారని అన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



కాలనీల్లో జరరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం జగనన్న కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి మండలం, దిగువ అబ్బవరం గ్రామ పరిధిలోని అబ్బవరం, ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న లేఔట్లలో సీసీ రోడ్ల నిర్మాణ ప్రగతి, విద్యుత్ పోల్స్, లైన్ల ఏర్పాటు, నీటి వసతి, ఆర్చి నిర్మాణం తదితరాలపై పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు జారీ చేశారు. ఫిబ్రవరి నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉంటుందన్న సమాచారంతో లేఔట్లలో మౌలిక వసతులు కల్పించే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్ రెడ్డి, హౌసింగ్, డ్వామా పీడీలు శివయ్య, వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఆర్అండ్‌బి ఎస్ఈ సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభాసుపాలైన 'ఆధార్'!

- పాడుబడిన గదిలో పడిఉన్న ఆధార్‌కార్డులు!
- పోస్టాఫీసు సీలుతో పత్రాలు ఉండటంపై అనుమానాలు



కుప్పలుతెప్పలుగా పడి ఉన్న ఆధార్‌కార్డులు

రాజంపేట: నేటి డిజిటల్ యుగంలో మనకు సంబంధించిన చిన్న వివరం తెలిసినా.. కొందరు సైబర్ కేటుగాళ్లు కూపీ లాగి మరీ మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఆధార్‌కార్డును ఎంతో భద్రంగా దాచుకోవాలి. ఇది ఇతరుల చేతికి చిక్కితే ఇక అంతే. అలాంటి ఆధార్ వ్యవస్థ రాజంపేటలో అభాసుపాలైంది. ముఖ్యమైన ఈ కార్డులు న్యూ బోయనపల్లె (రాజంపేట మండలం) శివారులోని పాడుబడిన గదిలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటన సోషల్‌మీడియాలో కూడా హల్‌చల్‌చేసింది. ఆధార్‌కార్డులతో డ్రైవింగ్ లైసెన్స్‌లు, చెక్‌లు, ఎల్ఐసీ బాండ్లు కనిపించడం గమనార్హం. ఆధార్ కార్డు మంజూరై ఉంటే కావాల్సిన వారికి ఎందుకు తపాలా శాఖ బట్వాడా చేయలేదన్న అంశం చర్చనీయాంశంగా మారింది. రాజంపేట మండలంలోని ఒకే ప్రాంతానికి చెందిన ఆధార్‌కార్డులు, చెక్ బుక్‌లు కనీసం సీలు కూడా ఓపెన్ చేయకుండా అలాగే పడేశారు. వీటిపై పోస్టాఫీసు సీలు ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని పాడుబడిన గదిలో పారవేయడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థకావడంలేదు. ఇవి చాలకాలంగా ఈ గదిలో ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. అంతేకాకుండా ఒక కలర్‌ప్రింటర్ అట్టపెట్ట కనిపించడంతో బోగస్ ఆధార్ కార్డులు సృష్టికీరణ జరిగిందా? ఇందుకు కారకులు ఎవరు అన్నది అంతుబట్టని ప్రశ్నగా మారింది. మొత్తం మీద తపాలా సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నారు. దీనిపై విచారణ చేస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు అంటున్నారు. పోస్టల్‌సీల్ కలిగి ఉన్న ఈ ఆధార్‌కార్డుల విషయం గురించి తపాలాశాఖ కడప సూపరింటెండెంట్ రాజేష్‌తో మాట్లాడగా విచారణ చేయిస్తామన్నారు. విచారణలో వాస్తవాలు తేలితే తగిన చర్యలు తప్పవన్నారు. తపాలా శాఖ ఏఎస్పీ రెడ్డిబాషా సంఘట స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత పోస్ట్ మెన్ జితేంద్రను విచారించారు. నివేదికను సిద్ధం చేసినట్లు తెలిపారు.

తవ్వుకునోళ్లకు తవ్వుకున్నంత!

- కూటమి శ్రేణులకు ఆదాయ వనరుగా మారిన ఇసుక రవాణా
- రాత్రిళ్లు యథేచ్ఛగా బెంగళూరుకు రవాణా
- అక్రమంగా తరలుతున్నా అడిగే వారేరి?

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి కూటమి సర్కార్ రాగానే ఆదాయ వనరులపై దృష్టి సారించింది. ఎక్కడపడితే అక్కడ, ఏది పడితే అది దొరికిందే పరమావధిగా లాగేసుకుంటున్నారు. అర్హత, అనర్హతలను పక్కన పెట్టి అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. ఇదేమని అడిగే అధికారులు లేకపోగా....ఇది అక్రమమని చెప్పేవారు లేకపోవడంతో వారు ఆడిందే ఆట...పాడిందే పాటగా కొనసాగుతోంది. ఒకటేమిటి ఇసుక, మద్యం, ఖాళీగా కనిపిస్తే స్థలాల కబ్జా, మట్టి తవ్వకాలు ఇలా ఆదాయమే పరమావధిగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు ఆగిపోవడంతో ఇసుక డిమాండ్ తగ్గిన నేపథ్యంలో ఇదే అదునుగా భావించి ఇసుక ఎల్లలు దాటుతోంది.

పట్టుబడుతున్నా....

జిల్లాలోని టంగుటూరు, జంగాలపల్లె, నారాయణనెల్లూరు, చెయ్యేరు పరివాహక ప్రాంతాలతో పాటు ఓబిలి, కోడిచెన్నైగారిపల్లె, కలికిరి మండలంలోని అద్దంవారిపల్లె సమీపంలో ఇసుకాసురులు ఇసుకను తోడేస్తున్నారు. మహల్ యేరు తదితర ప్రాంతాల నుంచి ఎక్కడికక్కడ అధికార పార్టీలోని దిగువశ్రేణి నేతలు యథేచ్ఛగా ఇసుక లూటీ చేస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలోని కలికిరి మండలం అద్దంవారిపల్లె వద్ద బ్రిడ్జి కింద గతంలో ఇసుకను విపరీతంగా తరలించడంతో బ్రిడ్జి పిల్లర్లు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ట్రాక్టర్లను అడ్డుకోవద్దన్న నిబంధలను అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా కానిచ్చేస్తున్నారు. రెండు నెలల కిందట నందలూరు వద్ద పెద్ద ఎత్తున టిప్పర్లు, ట్రాక్టర్లు దొరకగా, పెనగలూరులోనే అదే వరుసలో పట్టుబడ్డాయి. రెండు రోజుల కిందట సిద్దవటంలోనూ కడపకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇలా చెబుతూపోతే నాలుగు రోజులకు ఒకసారి జిల్లా వ్యాప్తంగా ఏదో ఒకచోట ఇసుక అక్రమంగా తరలిస్తూ వాహనాలు పట్టుబడుతూనే ఉన్నాయి. అయినప్పటికీ అధికార పార్టీ అండదండలు ఉన్నాయన్న ధీమానో, లేకపోతే ఏమి కాదులే అన్న ధైర్యమో తెలియదుగానీ ఇసుక మాత్రం తరలిపోతూనే ఉంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు ప్రాంతాల్లో నిల్వ చేసిన ఇసుకను కూడా తమ్ముళ్లు అక్రమంగా తరలించేశారు.




అద్దంవారిపల్లె బ్రిడ్జి కింద గతంలో ఇసుక తవ్వడంతో బయటపడిన పిల్లర్లు



జాతీయ రహదారిపై సరిహద్దులు దాటించేందుకు టిప్పర్లలో తీసుకెళుతున్న ఇసుక

సరిహద్దులు దాటుతోంది

అన్నమయ్య జిల్లాలో అధికారికంగా ఆరు రీచ్‌లకు అనుమతులు ఉన్నాయి. అందుకు సంబంధించి ఒకటి, రెండింటిలో కొన్ని ఇబ్బందులున్నా మిగతా వాటిలో కావాల్సినంత ఇసుక లభ్యమవుతోంది. ప్రధానంగా బుడుగుంటపల్లె, టంగుటూరు, ఇతర కొన్ని రీచ్‌లలో ఇసుక ఎంత కావాలంటే అంత లభిస్తోంది. అయితే అన్నిచోట్ల ఇసుకను అవసరమైన వారు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అయితే రీచ్‌ల నుంచి తెలుగు తమ్ముళ్లు టిప్పర్ల ద్వారా సరిహద్దులు దాటిస్తున్నారు. జిల్లా నుంచి బెంగళూరుకు టిప్పర్ల ద్వారా రాత్రిళ్లతో పాటు పగలుకూడా పంపించి సొమ్ము చేసుకుంటున్నారు. అందులోనూ మైనింగ్ అధికారులు కూడా కన్నెత్తి చూడడం లేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రీచ్‌లలో కూడా ఒకచోట తవ్వాల్సి ఉండగా, మరొకచోట ఎక్కడబడితే అక్కడ తవ్వుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇసుకకు ఇతర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో సరిహద్దులు దాటించి నేతలు సొమ్ముచేసుకుంటున్నారు.



ప్రతిధ్వనించిన రామనామం

- కడప రోడ్లు కాషాయమయం
- అడుగడుగునా భక్తజన నీరాజనం

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో హిందువుల ఆధ్యాత్మిక మహా శోభాయాత్ర వైభవంగా సాగింది. అయోధ్యలో బాల శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నేటికీ ఏడాది గడిచిన సందర్భంగా తొలి వార్షికోత్సవాన్ని ఈ యాత్ర నిర్వహణ ద్వారా నిర్వహించుకున్నారు. అయోధ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయం కేంద్రంగా దీని పూర్వాంగ కార్యక్రమాలు సాగాయి. ఉదయం 10 గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది.ఈ సందర్భంగా పూలతో అలంకరించిన రథంపై శ్రీరాముని భారీ విగ్రహాన్ని కొలువుదీర్చారు. వేద పండితులు మంత్రోచ్చాటనలు చేస్తూ ప్రజలకు కల్యాణ హారతులు ఇస్తుండగా, భక్తులు తన్మయత్వంతో కార్యక్రమాలను తిలకించారు.

- ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ తదితర ధార్మిక సంఘాలతో పాటు పలు దేవాలయాల నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు, భజన బృందాలు, అర్చక సంస్థలు, హిందూ సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రత్యేక వాహనాల్లో భక్తులు ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా విచ్చేశారు. అయోధ్య ఐక్యవేదిక స్థానిక ప్రతినిధి, కార్యక్రమ నిర్వాహకులు దేసు వెంకటరెడ్డి యాత్ర ముగిసేవరకు తన బృందంతో ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పోలీసులు, అధికారులు, సిబ్బంది సహకారంతో యాత్ర సజావుగా కొనసాగింది.



కడప: అప్సర సర్కిల్ వద్ద శోభయాత్ర



కడపలోని కృష్ణా సర్కిల్ వద్ద భక్తజనసందోహం

క్లుప్తంగా

లక్ష్మీ నరసింహ స్వామి గుడిలో చోరీ


హుండీని ముళ్ల పొదల్లో పడేసిన దుండగులు

వీరబల్లి : మండలంలోని పెద్దవీటి పంచాయతీ, రెడ్డివారిపల్లి దగ్గర గుట్టపై ఉన్న అతి పురాతన లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఏఎస్‌ఐ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ముళ్ల పొదల్లో పడేసిన హుండీని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాజంపేట హైవేపై రోడ్డు ప్రమాదం

రాజంపేట : రాజంపేట మండలం రామాపురం పంజాబీ డాబా వద్ద బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. నందలూరు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఆకేపాడుకు వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానికులు 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సబ్ స్టేషన్ పోరంబోకు స్థలం కబ్జా


కబ్జాకు గురవుతున్న సబ్ స్టేషన్ స్థలం

ఓబులవారిపల్లె : కొర్లకుంట సబ్ స్టేషన్ ప్రహరీ పక్కనే ఉన్న పోరంబోకు స్థలాన్ని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. కొన్నేళ్లుగా నాయీ బ్రాహ్మణులు తమ పొట్టకూటి కోసం బంకులు ఏర్పాటు చేసుకున్నారు. అయితే గ్రామంలోని కబ్జాదారుల కన్ను కొర్లకుంట గ్రామానికి వచ్చే ప్రధాన రహదారుల పక్కన ఉన్న ఖాళీ స్థలంపై పడింది. దీంతో ఎవరి అనుమతులు లేకుండా యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడి పక్కా భవనాలు నిర్మించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ సబ్ స్టేషన్ పోరంబోకు స్థలానికి కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లారీ డ్రైవర్లపై ఖాకీ జులుం

- జార్ఖండ్ డ్రైవర్ కాలు విరగ్గొట్టిన పోలీసులు
- బాధితుడికి అండగా లారీ అసోసియేషన్ నాయకులు
- రాజీ కుదుర్చుకునేందుకు పోలీసుల విశ్వప్రయత్నాలు
- కుదరకపోవడంతో కేసులు పెడతామని బెదిరింపులు
- తాలూకా సీఐ ఆగడాలపై డీఎస్పీకి బాధితుల ఫిర్యాదు


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో లారీ డ్రైవర్ మహబూబ్‌బాషా చొక్కా పట్టుకుని బలవంతంగా లాక్కెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సీఐ కళా వెంకటరమణ


పోలీసుల జులుంను మీడియాకు వివరిస్తున్న బాధిత జార్ఖండ్ డ్రైవర్ నాహిద్

మదనపల్లె: ఇద్దరు లారీ డ్రైవర్లపై తాలూకా పోలీసులు ఖాకీ జులుం ప్రదర్శించి ఓ డ్రైవర్ కాలు విరగ్గొట్టిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాగ్‌కు చెందిన ఎండీ.అబీద్ కుమారుడు ఎండీ.నాహిద్(39) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సొంత రాష్ట్రంలో పనులు లేకపోవడంతో ఉపాధి కోసం శ్రీ సత్యసాయిజిల్లా కదిరికి వలస వచ్చాడు. మంగళవారం ముదిగుబ్బ నుంచి తమిళనాడులోని ఈరోడ్ పేపర్‌మిల్లుకు కట్టెల లోడు వేసుకుని బయలుదేరాడు. రాత్రి 11.30 గంటల సమయంలో లారీ మదనపల్లె మండలం తట్టివారిపల్లె వెంగమాంబ సర్కిల్ వద్దకు రాగా, అక్కడ వాహనాలను తనిఖీ చేస్తున్న తాలూకా సీఐ కళా వెంకటరమణ, పోలీసులు లారీని ఆపారు. బండిని పక్కకు పెట్టి రికార్డులు, అనుమతిపత్రాలు తేవాల్సిందిగా కోరారు. లారీ డ్రైవర్ నాహిద్ రికార్డులు చూపించాక, ఐదువేలు జరిమానా కట్టాల్సిందిగా పోలీసులు ఆదేశించారు. దీంతో డబ్బులు తనవద్ద లేవని, ఓనర్‌తో మాట్లాడాల్సిందిగా డ్రైవర్ చెప్పాడు. పోలీసులు ఓనర్‌తో మాట్లాడితే...ఆయన తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని, పెనాల్టీ కట్టాల్సి వస్తే...అందుకు సంబంధించి బిల్లు ఇస్తే కట్టేందుకు తాను సిద్ధమేనని చెప్పాడు. వెనుకే తమకు చెందిన మరో లారీ వస్తోందని చెప్పాడు. దీంతో లారీ వచ్చేవరకు బండిలో ఉండాల్సిందిగా నాహిద్‌కు పోలీసులు చెప్పారు. అరగంట తర్వాత కదిరికి చెందిన మహబూబ్‌బాషా ఈరోడ్ పేపర్‌మిల్లుకు లారీలో కట్టెలలోడు వేసుకుని అక్కడకు వచ్చాడు. అతడి లారీని ఆపి రికార్డులు చూపమని పోలీసులు అడిగారు. చూపాక, ఫైన్ కట్టాలని పోలీసులు చెప్పారు. దీంతో అతను తమ యజమానితో మాట్లాడాలని చెప్పాడు. ఇద్దరు లారీ డ్రైవర్లు ఒకేలా చెప్పడంతో కోపం తెచ్చుకున్న సీఐ కళా వెంకటరమణ, ముందు లారీ డ్రైవర్ నాహిద్‌ను తీసుకురావాల్సిందిగా సిబ్బందిని ఆదేశించాడు. లారీ వద్దకు వెళ్లిన పోలీసులు, లాఠీలతో డోరును బలంగా కొట్టి నిద్రపోతున్న డ్రైవర్ నాహిద్‌ను కిందకు రావాల్సిందిగా గదమాయించారు. రికార్డులు మరోసారి తేవాల్సిందిగా కోరారు. లారీ బాక్స్‌లోని రికార్డులు తీసేలోపు ఎంత సేపు చేస్తావురా అంటూ బూతులు మాట్లాడటం ప్రారంభించారు. దీంతో కదిరికి చెందిన డ్రైవర్ మహబూబ్‌బాషా, అతడికి తెలుగు రాదని చెప్పాడు. ఇంతలో నాహిద్, తనను తిడుతున్న పోలీసులతో, నేను ఏం తప్పుచేశాను. ఏమన్నా యాక్సిడెంట్ చేసి పారిపోతున్నానా..? లేక దొంగవస్తువులు తోలుతున్నానా? నా వద్ద రికార్డులు లేవా ? ఎందుకు కొడుతున్నారంటూ హిందీలో ప్రశ్నించాడు. దీంతో చిర్రెత్తిపోయిన పోలీసులు మాకే ఎదురుచెపుతావా అంటూ లారీలో నుంచి డ్రైవర్ నాహిద్‌ను కిందకు లాగారు. డ్రైవర్ ఎదురు ప్రశ్నించిన విషయాన్ని సీఐ కళా వెంకటరమణకు పోలీసులు చెపితే, ఆయన నాహిద్ వద్దకు వచ్చి బూతులు మాట్లాడుతూ.. కింద పడవేసి కాలితో తన్ని, పోలీసులు విచ్చలవిడిగా చితకబాదారు. దీంతో డ్రైవర్ నాహిద్ స్పృహతప్పి పడిపోగా, వీడు యాక్టింగ్ చేస్తున్నాడు, మరో నాలుగు తగిలించండంటూ సీఐ పోలీసులను పురమాయించాడు. అనంతరం అక్కడి నుంచి పోలీసులు వెళ్లిపోగా, స్పృహతప్పి పడి ఉన్న డ్రైవర్ నాహిద్‌ను బుధవారం ఉదయం మహబూబ్‌బాషా ఆస్పత్రికి తీసుకువచ్చాడు. పరీక్షించిన వైద్యులు ఎడమకాలు విరిగిపోయినట్లు నిర్ధారించారు. దీంతో మరో డ్రైవర్ మహబూబ్‌బాషా, స్థానిక లారీ అసోసియేషన్‌కు జరిగిన విషయం చెప్పడంతో రాష్ట్రీయ చాలక్ ఏక్తా మహామంచ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబ్‌జాన్, తోటి డ్రైవర్లతో కలిసి ఆస్పత్రికి చేరుకుని బాధితుడికి అండగా నిలిచారు. తాలూకా సీఐ కళా వెంకటరమణపై డీఎస్పీకి ఫిర్యాదు చేయాలని అసోసియేషన్ సభ్యులు తీర్మానించుకున్నారు. ఈలోపు జిల్లా ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బాధితుడిని పరామర్శించి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో తనకు ఇబ్బంది కలుగుతోందని తెలుసుకున్న తాలూకా సీఐ కళావెంకటరమణ, జిల్లా ఆస్పత్రికి చేరుకుని కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని డ్రైవర్ మహబూబ్‌బాషాతో వాగ్వాదానికి దిగారు. ఆస్పత్రి ఆవరణలో అందరూ చూస్తుండగా, పోలీసు విధులకు ఆటంకం కలిగించి, కాలర్ పట్టుకున్నావని, నీపై కేసు పెట్టి లోపల వేస్తానంటూ బెదిరించారు. స్టేషన్‌కు పద అంటూ చొక్కా పట్టుకుని లాగారు. తాను రానంటున్నా, బలవంతంగా లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో లారీ అసోసియేషన్ సభ్యులు బాధితులను తామే డీఎస్పీ కార్యాలయానికి తీసుకువస్తామని, మీరు వెళ్లాలని చెప్పడంతో అక్కడి నుంచి సీఐ వెళ్లిపోయారు. బాధితులతో కలసి అసోసియేషన్ సభ్యులు డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. సమయానికి డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో మరోసారి సీఐ వారితో వాగ్వాదానికి దిగి బ్లాక్ మెయిల్ చేస్తున్నారా అంటూ వారిని బెదిరించారు. తాము న్యాయం కోసం ఇక్కడకు వచ్చామని, బతుకు తెరువుకు డ్రైవర్‌గా పనిచేసే తమపై ఇలాంటి జులుం ప్రదర్శిస్తే తామెలా బతకాలని వాపోయారు. డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన అసోసియేషన్ సభ్యులు.. ఆయన రాక కోసం సాయంత్రం వరకు కార్యాలయం వద్దే వేచి చూశారు. ఈ విషయమై తాలూకా సీఐ కళా వెంకటరమణ మాట్లాడుతూ... వాహనాల తనిఖీలో భాగంగా లారీని నిలిపి రికార్డులు చూపమని అడిగితే జార్ఖండ్ డ్రైవర్ నాహిద్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పాటు పోలీసులపై ఎదురుతిరిగాడన్నారు. దీంతో మందలించామన్నారు. తప్పితే పోలీసులు అతడిపై దాడి చేయలేదన్నారు. డీఎస్పీ కొండయ్యనాయుడు లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో పోలీసులకు, బాధితులకు మధ్య రాజీ కుదిర్చినట్లు తెలిసింది.

ఆకతాయిల నుంచి రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న జీఎస్ఎఫ్ అధ్యక్షుడు నాగేంద్ర

సుండుపల్లె : మండలంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులను ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో కొంత మంది ఆకతాయిలు వేధిస్తున్నారని గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు నాగేంద్ర నాయక్ చౌహాన్, గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నాగన్న తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాల గ్రౌండ్‌లో నుంచి ఇంటికి వెళుతున్న బాలికల పట్ల ఒక రెవెన్యూ అధికారి కుమారుడు అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. ఆకతాయిల నుంచి బాలికలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

చిరు దుకాణాన్ని కూల్చడం దుర్మార్గం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి


రాచపల్లెలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : బతుకుదెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిరు దుకాణాన్ని కూల్చేసి నష్టం చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లె పంచాయతీ సచివాలయం, పాఠశాల సమీపంలో గణేష్‌కుమార్‌రెడ్డి బతుకు దెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిరు దుకాణాన్ని నేలమట్టం చేసిన శిథిలాలను బుధవారం ఆయన పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రే అధికార నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఎవ్వరికి అడ్డు లేని ప్రాంతంలో బతుకుదెరువు కోసం చిన్న దుకాణం ఏర్పాటు చేసుకున్న వారిపై రాజకీయ కక్ష సాధించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే 46 సెంట్లు భూమి వారి పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో ఉందన్నారు. పది మందికి విద్యనందించే పాఠశాల కోసం ఉచితంగా స్థలం అందించిన వారికే నష్టం కలిగించడం దుర్మార్గమన్నారు. చిన్న చిన్న విషయాల్లో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవడం మంచి పరిణామం కాదన్నారు. అదే గ్రామంలో కొంత మంది ప్రభుత్వ భూములను ఆక్రమించి కంచెలు వేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు.

పరామర్శ..

రాచపల్లెకు చెందిన వెంకట్రామరాజు ఇటీవల మెకాలికి శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని శ్రీకాంత్‌రెడ్డి అతని స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.

అమ్మచెరువుమిట్టలో ఆక్రమణల తొలగింపు


అమ్మచెరువుమిట్టలో పునాదులను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మదనపల్లె : అమ్మచెరువుమిట్ట హౌసింగ్ లేఅవుట్‌లో ప్రజా అవసరాల కోసం ఖాళీగా ఉంచిన స్థలంలో అక్రమార్కులు నిర్మించిన పునాదులను బుధవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. అమ్మచెరువుమిట్టలో కమ్యూనిటీ పర్పస్ కోసం వదలిన స్థలంలో కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని పునాదులు నిర్మించినట్లు స్థానికులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌ఐ శేషాద్రి, వీఆర్‌ఓలు శివశంకర్, భరత్, కల్యాణి, శ్రీనివాసులు అమ్మచెరువుమిట్టకు వెళ్లి జేసీబీ సహాయంతో పునాదులు తొలగించారు.

భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణ పరిధిలో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర నేత బి.ఓబయ్య, అన్నమయ్య జిల్లా నేత ఎం.విశ్వనాథ డిమాండ్ చేశారు. పట్టణ పరిధిలోని మాసాపేట ఇందిరమ్మ కాలనీలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను వారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీకి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో కొందరు కబ్జాదారులు అక్రమంగా ఇళ్లకు పునాదులను నిర్మించారన్నారు. మరికొందరు స్థలాలను కబ్జాచేసి పేదలకు ఇష్టారాజ్యంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. విషయం తెలిసినప్పటికీ రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. కబ్జాకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకుని అర్హులకు పంచిపెట్టాలన్నారు. లేనిపక్షంలో పేదలతో కలిసి ఆందోళన చేపడతామన్నారు.

అట్టపెట్టెలతో అయోధ్య రామ మందిరం



పుల్లంపేట : దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ అట్టపెట్టెలతో అయోధ్య రామ మందిరం నమూనా తయారు చేశారు. అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా దీన్ని తయారు చేసినట్లు తెలిపారు.

సింగిల్ విండోలో నాణ్యతలేని బంగారంపై రుణాలు

ఉన్నతాధికారుల విచారణ


సింగిల్ విండో బ్యాంకులో విచారణ చేస్తున్న అధికారులు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని కన్నెమడుగు సహకార సొసైటీ సింగిల్ విండో బ్యాంకులో నాణ్యతలేని బంగారంపై రుణాల పంపిణీ జరిగినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. బుధవారం మదనపల్లె సబ్ డివిజనల్ కోఆపరేటివ్ బ్యాంకు అధికారి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి స్వర్ణలత రుణాల పంపిణీపై విచారణ జరిపారు. ఈ విచారణ మూడు రోజుల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మొదట బ్యాంకులో అప్రైజర్‌గా పని చేసిన క్రిష్ణమూర్తి ఆచారిని విచారించారు. బ్యాంకులో 17 మంది ఖాతాదారులకు రూ.32 లక్షల బంగారు తాకట్టుపై రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ తాకట్టు బంగారంలో నాణ్యతలేదని అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై ఖాతాదారులను కూడా బ్యాంకుకు పిలిపించి సమగ్ర విచారణ చేస్తామన్నారు. విచారణ పూర్తికాగానే పూర్తి విషయాలు వెల్లడిస్తామన్నారు. బంగారు నాణ్యత లేక పోయినా నకిలీదిగా నిర్ధారణ అయినా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఇద్దరు ఖాతాదారులు రూ.2.75 లక్షలు డబ్బులు చెల్లించి నగలు విడిపించుకున్నారు.

నిరుద్యోగులను మోసగించిన కూటమి ప్రభుత్వం

– ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి అందించకుండా, ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం జాగువారిపల్లి గ్రామంలో గీతారెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కో నిరుద్యోగికి రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారం చేపట్టాక నట్టేట ముంచారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా హామీలు అమలు చేయకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనంతయ్యగారిపల్లి రాజారెడ్డి, శ్రీను, దండుగోపి తదితరులు పాల్గొన్నారు.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి : మండలంలోని తాటికుంటపల్లిలో హరీష్‌కు చెందిన చిల్లర దుకాణంలో 13 మద్యం బాటిళ్లను స్వా ధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మోహన్ నాయక్ తెలిపా రు. మద్యం బాటిళ్లు అధిక రేట్లకు అమ్ముతున్నారనే స మాచారం మేరకు దాడి నిర్వహించి బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు.

మహిళ ఆసుపత్రికి తరలింపు


మహిళను ఆసుపత్రికి తరలించిన విజిలెన్స్ సిబ్బంది

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం వద్ద మూర్ఛకు గురైన మండలంలోని మంటపంపల్లి గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మ (50) అనే మహిళను ఆలయ విజిలెన్సు సిబ్బంది హుటాహుటిన ఒంటిమిట్ట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆసుపత్రిలో ఉన్న డ్యూటీ డాక్టర్ ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. ఆమె ఆరోగ్యం బాగానే ఉందని వైద్యాధికారి స్పష్టం చేశారు.

ఇద్దరు యువకులకు గాయాలు

కురబలకోట : కురబలకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద బుధవారం రాయచోటికి చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. రాయచోటి నుంచి ఫైజాన్(22), అతని స్నేహితుడు ఫర్హాన్(22) బైకులో మదనపల్లెకు వస్తుండగా రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 సిబ్బంది మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫైజాన్‌ను బెంగళూరు ఆసుపత్రికి తరలించారు.

కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి రోడ్డు నిర్మాణం

రైల్వేకోడూరు అర్బన్ : కోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ రైల్వేకోడూరు లక్ష్మీ ప్యారడైజ్ ఎదురుగా రోడ్డు నిర్మిస్తున్నారని బుధవారం స్థల యజమాని ప్రసాద్ కోడూరు సీఐ హేమసుందర్ రావుకు ఫిర్యాదు చేశారు. హైకోర్టు నుండి ఉత్తర్వులు పొందినప్పటికీ పట్టించుకోకుండా అధికారులు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రైలు కింద పడి బేల్దారి ఆత్మహత్య


ఆంజనేయులు(ఫైల్)

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ పరిధిలో కడప వైపు వెళ్లే రైల్వేలైన్ వద్ద దేరంగుల ఆంజనేయులు (36) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలకు అనంతపురం జిల్లా యాడికి మండలానికి చెందిన ఆంజనేయులు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు. ఐదు నెలల క్రితం ఎర్రగుంట్లకు వచ్చి బేల్దారి పనులు చేసేవాడు. ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ బంగారం విక్రేతల అరెస్ట్

రూ.21 లక్షలు స్వాధీనం

సోమందేపల్లి : తక్కువ ధరకే మేలిమి బంగారాన్ని అందజేస్తామని నమ్మబలికి నకిలీ బంగారం అంటగట్టి డబ్బుతో ఉడాయించిన కేసులో పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రాణా కృష్ణబాబు, కర్ణాటకకు చెందిన శాంతరాజు, నయాజ్ అహమ్మద్, ఈరన్న, బాబు, అర్జున్, ఆనంద్‌బాబు, బంగారి, ఈడిగ హరిప్రసాద్ ఓ ముఠాగా ఏర్పడి నకిలీ బంగారం దందా చేపట్టారు. ఈ క్రమంలోనే నకిలీ బంగారపు పూసల దండలు సేకరించుకుని, అందులో కొన్ని మేలిమి బంగారం పూసలను చేర్చారు. అనంతరం కొనుగోలుదారులు పరీక్షించుకునే సమయంలో మేలిమి బంగారం పూసలను మాత్రమే చూపించేవారు. ఇటీవల అనంతపురం జిల్లా విడపనకల్లుకు చెందిన ఈశ్వరన్న, చిత్తూరు జిల్లా కుప్పం నివాసి ముని వెంకటేష్‌కు ముఠా సభ్యులు ఫోన్ చేసి మాట్లాడారు. తమకు తవ్వకాల్లో మేలిమి బంగారం లభ్యమైందని, తక్కువ ధరకే వాటిని విక్రయిస్తామని నమ్మబలికారు. వారి మాయలో చిక్కుకున్న ఇద్దరినీ ఈ నెల 9న సోమందేపల్లి బ్రాహ్మణపల్లి వద్దకు రప్పించుకున్నారు. తొలుత ఈశ్వరన్న వద్ద రూ.8 లక్షలు తీసుకున్నారు. అనంతరం ముని వెంకటేష్ వద్ద రూ.13 లక్షలు తీసుకుని ఇద్దరికీ నకిలీ బంగారం పూసల దండలు చేతిలో పెట్టి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించారు. కాసేపటి తర్వాత వాటిని పరిశీలించుకున్న ఈశ్వరన్న, ముని వెంకటేష్ అవి నకిలీవని నిర్ధారించుకుని వెంటనే సీఐ రాఘవన్‌కు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ రమేష్‌బాబు బృందాలుగా విడిపోయి నిందితుల కోసం గాలింపు చేపట్టి బుధవారం పక్కా ఆధారాలతో మొత్తం పది మందినీ అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.21 లక్షలతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో మరికొందరు పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. తక్కువ మొత్తానికి బంగారం ఇస్తామని ఫోన్లు చేసి ఆశ చూపితే ఆకర్షణకు గురి కావద్దని ప్రజలకు సూచించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ బి.చంద్ర నాయక్, రైతులు

సుండుపల్లె : రైతులందరూ ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ బి. చంద్ర నాయక్ తెలిపారు. సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రం పరిధిలోని పెద్దమాదిగపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సంబంధిత ఆర్‌ఎస్‌కే సిబ్బంది దగ్గర ఈ-పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల ఉధృతిని ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా తెలుకొని వాటి నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.మహబూబ్ బాషా, వ్యవసాయ అధికారి (టెక్నికల్) మోహన్, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.